



ఉచిత చేప పిల్లల పంపిణీపై అయోమయం!

ఎల్లారెడ్డి, జూలై 3: ఉచిత చేప పిల్లల పంపిణీ పథకంపై మత్స్యకారుల్లో అయోమయం నెలకొంది. వానాకాలం వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న సంకల్పంతో పాటు ఉపాధి కల్పించాలని లక్ష్యంతో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం అమలుపై సందిగ్ధం నెలకొంది. కాంగ్రెస్ సర్కార్ ఈ పథకంపై ఎటూ తేల్చకపోవడంతో ఈ పథకం ఉంటుందా ఉండదా అని అనే అనుమానాలు వ్యక్తం అవుతోంది. మే, జూన్ మొదటి వారంలో చేప పిల్లల కొనుగోలు టెండర్ల ప్రక్రియ ఇవ్వాల్సి ఉంది. అయితే ఈ ప్రక్రియ ఇప్పటి వరకు జరగకపోవడంతో ఉచిత చేప పిల్లల పెంపకానికి పథకానికి మంగళం పడనుందా అని అనేక అనుమానాలు నెలకొన్నాయి. ఈ పథకంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతను ఇవ్వాలని మత్స్యకారులు కోరుతున్నారు.

- చేప పిల్లల పంపిణీ కోసం ఎదురు చూపు
- ఇంకా టెండర్ల ప్రక్రియ మొదలు పెట్టని ప్రభుత్వం
- ఏటా ఉచితంగా పంపిణీ చేసిన గత ప్రభుత్వం
- సకాలంలో అందించాలంటున్న మత్స్యకారులు
- జిల్లాలో రెండు రిజర్వాయర్లు, 719 చెరువులు 273 మత్స్యకార సంఘాలు

ఎలాంటి ఆదేశాలు రాలేదు



- వరదారెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి

ఉచిత చేప పిల్లల పంపిణీ పథకంపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేవు. జూన్ మొదటి వారంలోపే టెండర్ల ప్రక్రియ జరగాల్సి ఉండగా, నేటి వరకు ఎలాంటి టెండర్లు నిర్వహించలేదు. మత్స్యశాఖ కమిషనరేట్ నుంచి ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నాం. ఆదేశాలు వస్తే చేప పిల్లల పంపిణీ పథకం ప్రక్రియ మొదలవుతుంది.

జిల్లాలో 2.70 కోట్ల చేప పిల్లల పంపిణీ లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా రెండు రిజర్వాయర్లు 719 చెరువులు కుంటలు ఉన్నాయి. వీటిలో ఏడాది రెండు కోట్ల 70 లక్షల చేప పిల్లలను పెంచాలని ప్రభుత్వ లక్ష్యం. జిల్లాలో 272 మత్స్య సహకార సంఘాలు ఉండగా ఇందులో 226 పురుష మత్స్యకార సంఘాలు, 46 మహిళా మత్స్య సహకార సంఘాలు ఉన్నాయి. సుమారు 19వేల మంది మత్స్యకారులు సభ్యులుగా ఉన్నారు. చెరువులు, కుంటల్లో వేసే చేప పిల్లలు 35 ఎంఎం నుంచి 40 ఎంఎం సైజ్ రిజర్వాయర్‌లో వేసే చేప పిల్లలు 82 ఎంఎం నుంచి 100 ఎంఎం సైజ్ ఉండాలి.

అమలు కాని సబ్సిడీ పథకాలు

ప్రభుత్వం మత్స్యకారులకు ప్రకటించిన సబ్సిడీ పథకాలు పూర్తిస్థాయిలో అందడం లేదు. ఇప్పటి వరకు వ్యాన్లు, ద్విచక్ర వాహనాలను మాత్రమే అందజేశారు. ఐస్ పాయింట్లు ఏర్పాటు రీ సైక్లింగ్, హార్టికల్చర్ సిస్టం స్కీంలు అమలుకు నోచుకోవడం లేదు. అష్టకష్టాలు పడి చేపలను పెంచితే వాటిని నమ్మడానికి సరైన వేదిక లేకపోవడంతో చేసేదేమి లేక చేపలను దళారులకు అప్పగించాల్సి వస్తోంది. మత్స్యకారులకు గిట్టుబాటు ధర లభించేందుకు ప్రతీ మండల కేంద్రంలో చేపల మార్కెట్ ఏర్పాటు చేయాలని మత్స్యకారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

చేప పిల్లలను సకాలంలో విడుదల చేయాలి

- సత్యనారాయణ, మత్స్య పారిశ్రామిక రంగం జిల్లా అధ్యక్షుడు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం మత్స్యకారులకు ఉచితంగా చేప పిల్లల పంపిణీ చేసిన విధంగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేప పిల్లలను పంపిణీ చేయాలి. పిల్లలను జూన్ మొదటి వారం నుంచి ఆగస్టు తరువాత పంపిణీ చేసేది. ఈసారి ఇప్పటి వరకు అధికారులు కనీసం టెండర్ల ప్రక్రియ కూడా ప్రారంభించలేదు. టెండర్ల ప్రక్రియ ముగిశాక కనీసం నెల రోజులైనా చేప పిల్లల పంపిణీ ప్రారంభానికి సమయం పడుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నాణ్యమైన రౌట, బొచ్చ, మొట్ట, బంగారు తీగ, మిర్గం లాంటి చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్, జూలై 3: రోగులకు మెరుగైన సేవలు అందించా లని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. బుధవారం కామారెడ్డి జీజీహెచ్ ఆసుపత్రిని ఆయన పరిశీలించారు. ఈఓపీ, ట్రామా, ఓటీ, మేల్, ఫిమేల్, పోస్ట్ ఆపరేట్ తదితర విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వస్తున్న రోగులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా వైద్యులు సేవలు అందించాలని సూచించారు. మెడికల్ కళాశాల అనుబంధంగా ఆసుపత్రి కొనసాగుతున్నందున నిపుణులైన వైద్యులు ఉంటారని ఆసుపత్రికి పెద్దఎత్తున ప్రజలు వస్తున్నారని వారి నమ్మకాన్ని నీరుకార్చవద్దని అన్నారు. అనంతరం వైద్యులతో సమస్యలపై చర్చించగా ఆసుపత్రిలోని డ్రైనేజీ వ్యవస్థ, కంటి విభాగంలో శస్త్ర చికిత్సలకు సంబంధించి ఆప్తమాలజీ మిషన్, ఎంఆర్ఐ, సిటీ స్కాన్ తదితర పరికరాలను అందించాలని వైద్యులు కోరారు. పలువురు గైనిక్, ఫిజీషియన్‌లు మానుకున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకుపోయారు. ఆసుపత్రిలోని చిన్నచిన్న మైనర్ రిపేర్‌లను హెచ్‌డీఎస్ ఫండ్ ద్వారా చేయించుకోవాలని మిగిలిన వాటిని తన దృష్టికి తీసుకువస్తే తగిన ఏర్పాట్లు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ రామ్‌సింగ్, డీసీహెచ్ఎస్ విజయలక్ష్మీ, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డిప్యూటీ సూపరింటెండెంట్లు ఆఫీస్ షెరి, బన్సీలాల్, ఆయా విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

మాతృ మరణాలు జరగకుండా వైద్యసేవలు అందించాలి

మాతృ మరణాలు జరగకుండా వైద్యసేవలు అందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చిన ఈ కాలంలో ప్రసవ సమయంలో మాతృమరణాలు సంభవించకుండా జాగ్రత్త పడడం వైద్యాధికారుల కర్తవ్యం అని అన్నారు. మాతృ మరణాలు జరగకుండా ఏఎన్ఎం స్థాయి నుంచి వైద్యాధికారి, జిల్లా స్థాయిలో ఎంసీహెచ్, ప్రోగ్రాం అధికారి వరకు అందరూ బాధ్యతతో ఉండాలని అన్నారు. నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్ర మంలో డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి శోభా రాణి, డీసీహెచ్ఎస్ విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

గాంధారి, జూలై 3: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సైబర్ నేరాలపై, మహిళలపై, చిన్న పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలపై ఎస్ఐ ఆంజనేయులు అవగాహన చేపట్టారు. ఇంటికి వెళ్లినప్పుడు సెల్‌ఫోన్ వినియోగించకూడదని దానివల్ల వచ్చే ప్రమాదాల గురించి వివరించారు. షీ టీం ప్రాముఖ్యత, పాఠశాల సమస్య ఉంటే టీచర్‌లకు గాని, పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ గణేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్మిషన్ల గడువు ఈ నెల 31 వరకు పొడిగింపు



నాగిరెడ్డిపేటలో విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్న జిల్లా నోడల్ అధికారి షేక్ సలామ్

- జిల్లాలో ఇప్పటి వరకు 1700 అడ్మిషన్లు
- ఇంటర్ విద్యా జిల్లా నోడల్ అధికారి షేక్ సలామ్

నాగిరెడ్డిపేట, జూలై 3: ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్ల గడువును ప్రభుత్వం జూలై 31వ తేదీ వరకు పొడిగించిందని, ఇంత వరకు ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ తీసుకోని విద్యార్థులు ఈ నెలాఖరులోగా అడ్మిషన్‌లు తీసుకోవాలని ఇంటర్ విద్యా జిల్లా నోడల్ అధికారి షేక్ సలామ్ కోరారు. నాగిరెడ్డి పేట మండల కేంద్రంలో నూతన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి విద్యార్థులకు తరగతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలను స్థానిక ఎంపీపీ వినీత, జడ్పీటీసీ మనోహర్ రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాలకు జూన్ నెల 30 వరకు గడువు ఉండగా, దీని ని జూలై 31 వరకు ప్రభుత్వం పెంచిందన్నారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా మొత్తం 43 జూనియర్ కళాశాలలు ఉన్నట్లు తెలిపారు. అందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 20 ఉండగా, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు 23 ఉన్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇప్పటి వరకు ఫస్టియర్‌లో 17 వందల మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నట్లు తెలిపారు. ప్రైవేట్ కళాశాలల్లో ఇంకా ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్లు ప్రారంభం కాలేవన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో జిల్లాలో 9 వేల మంది విద్యార్థినీ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులందరికీ ఉచితంగా పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశామ న్నారు. నాగిరెడ్డిపేట మండల కేంద్రానికి నూతనంగా మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పదవ తరగతి ఉత్తీర్ణులైన మండలంలోని విద్యార్థులందరూ అడ్మిషన్లు తీసుకునే విధంగా మండల ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పీ వినీత, జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, స్థానిక ఎంపీటీసీ మాధవి, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హేమ చందర్, ఎంఈవో వెంకటేశం పాల్గొన్నారు.

బంకుల్లో పెట్రోల్ లేక వాహనదారుల ఇక్కట్లు

బ్లాక్‌లో విక్రయాలు జరుపుతున్నా.. పట్టించుకోని అధికారులు

మద్నూర్, జూలై 3: మండల కేంద్రంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో ఉన్నటువంటి ఒకే ఒక్క పెట్రోల్ బంక్‌లో ఎప్పుడు చూసినా నో స్టాక్ బోర్డు కనిపించడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బంకు పక్కనే బ్లాక్‌లో కొందరు పెట్రోల్ విక్రయిస్తున్నట్లు వాహనదారులు ఆరోపిస్తున్నారు. బ్లాక్‌లో ఎక్కువ ధరకు డీజిల్, పెట్రోల్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీసారి తరచూ పెట్రోల్ బంక్ మూతపడటంతో వివిధ గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దగ్గరలోని మహారాష్ట్రకు వెళ్లి పెట్రోల్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మండల కేంద్రంలో ఉన్న మూడు పెట్రోల్ బంకుల్లో జాతీయ రహదారి నిర్మాణంలో తొలగించడం జరిగింది. ప్రస్తుతం ఉన్న ఒకే ఒక్క పెట్రోల్ పంప్‌లో సమయానికి పెట్రోల్‌లు అందకపోవడంతో వాహనదారులు బ్లాక్‌లో కల్తీ పెట్రోల్ కొనుగోలు చేసి వాహనదారులు మరమ్మతులకు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి పెట్రోల్ పంప్‌పై నిఘా పెట్టాలని రైతులు కోరుతున్నారు.



నో స్టాక్ బోర్డు పెట్టిన దృశ్యం

ఊరూరా వన మహోత్సవానికి ఏర్పాట్లు

- జిల్లాలో ప్రారంభమైన గుంతల తవ్వకం
- 88 వేలు మొక్కలు నాటడమే లక్ష్యం

ఎల్లారెడ్డి, జూలై 3: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వన మహో త్సవాన్ని విజయవంతం చేసేందు కు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇప్పటికే ప్రతీ గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలు పెంచారు. గ్రామ గ్రామాన గుంతలు తవ్వే పనిలో నిమగ్నమాయ్యరు. వానలు కురిస్తే మొక్కలు నాటేందుకు ఈనెల మొదటి వారంలోనే సిద్ధమవుతున్నారు.

జిల్లాలో లక్ష్యం ఇలా..

కామారెడ్డి జిల్లాలోని 22 మండలాల్లో 526 గ్రామ పంచాయతీల్లో, 527 నర్సరీలను ఏర్పాటు చేశారు. మొత్తం నర్సరీల్లో 17.88 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఏ గ్రామ నర్సరీలో పెంచిన మొక్కలు ఆ గ్రామంలోనే నాటాలని అధికారులు నిర్ణయించారు. గతంలో కొన్ని గ్రామాలకు కలిపి ఒక నర్సరీలో మొక్కలను పెంచడంతో ఇతర పల్లెలకు వాటిని తరలించడానికి రవాణా ఖర్చులు పెరిగిపోవడం, ఇతర ఇబ్బం దులు ఎదురయ్యాయి. దీంతో ప్రతీ పంచాయతీకి ఒక నర్సరీని ఏర్పాటు చేసింది. ఆయా గ్రామ పంచాయతీలోకి నర్సరీల నిర్వహణ బాధ్యతలు అప్పగించింది. అవసరం మేరకు పెద్ద పంచాయతీలో ఎక్కువగా చిన్న పంచాయతీల్లో తక్కువగా మొక్కలు పెంచారు.

గుంతలు తవ్విస్తున్నాం

- సురేందర్, డీఎల్‌పీవో

ఈనెల మొదటి వారంలో వర్షాలు కురవగానే మొక్కలను నాటేందుకు గ్రామ గ్రామాన ఉపాధి హామీ పథకం కూలీల రో డ్ల పక్కన గుంతలను తవ్విస్తున్నాం. నర్సరీల్లో మొక్కలు పెంచాం. ఫీల్డ్ అసిస్టెంట్లు గుంతలను తవ్వించే పనుల్లో ఉంటున్నారు. వానలు సమృద్ధిగా కురవగానే ఇంటింటికీ పూల మొక్కలు, పండ్ల మొక్కలు పంపిణీ చేస్తాం. అలాగే రోడ్ల పక్కన కాలువ గట్లపై ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటిస్తాం.

నర్సరీల్లో పెంచే మొక్కలు ఇవే..

నర్సరీల్లో నీడనిచ్చే మొక్కలు, పండ్ల మొక్కలు రహదారి వెంబడి నాటేందుకు టేకోమ, అడవి తంగేడు వంటి వాటిని సిద్ధం చేస్తుండగా, ప్రతీ ఇంటికి ఆరు మొక్కలు ఇచ్చేందుకు గులాబి, మందార, ఉసిరి, జామ, దానిమ్మ, నేరేడు మొక్కలను పెంచుతున్నారు. ఈనెల మొదటి వారంలో నిర్వహించే వన మహోత్సవంలో మొక్కలను నాటనున్నారు. అదే విధంగా హార్టికల్చర్‌లో భాగంగా పండ్ల తోటలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో సురేందర్

ప్రైవేటు దోపిడీ!

- జిల్లాలో ప్రైవేట్ మెడికల్ మాఫియాల జోరు
- కమీషన్ ఏజెంట్లుగా మెడికల్ ప్రాక్టీషనర్లు
- ఒక్కరిద్దరు కలిసి ఆసుపత్రుల ఏర్పాటు.. అరువు వైద్యులతో పేదరోగుల నుంచి దోపిడీ
- రోగిని తీసుకొస్తే నీకింత.. నాకింత
- చెప్పిన ఆసుపత్రులకు వెళ్లకపోతే అంతే సంగతులు
- అవసరం లేకున్నా పరీక్షలు.. వేలల్లోనే వసూళ్లు
- ప్రైవేట్ దందాకు అడ్డుకట్ట వేయలేకపోతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులు



కామారెడ్డి టౌన్, జూలై 3: జిల్లాలోని పలు ప్రైవేట్ హాస్పిటల్స్ డబ్బులు సంపాదించి పెట్టే క్యాష్‌పిటల్స్‌గా మారాయి. వైద్యం వ్యాపారంగా తయారైంది. వైద్యం కోసం ఆసుపత్రి స్థాపించి రోగులకు సేవలు అందించే కాలం నుంచి ప్రస్తుతం అరువు వైద్యున్ని నియమించుకుని, ఆర్ఎంపీలు, పీఎంపీలు, అంబులెన్స్ డ్రైవర్‌లు, పీఆర్‌వోల సాయంతో వ్యాపారం చేసే పరిస్థితులకు దిగజారాయి. రోగం లేకపోయినా.. సృష్టించి వైద్యం చేసే స్థాయికి జిల్లాలో పలు ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయంటే నమ్మక తప్పదు. రోగి బాధను, భయాన్ని క్యాష్ చేసుకునే వ్యాపారం ప్రణాళికబద్ధంగా సాగిపోతోంది. కొత్తగా ఏర్పాటైన ఆసుపత్రుల నుంచి అంతో ఇంతో పేరున్న హాస్పిటళ్ల వరకు గ్రామాలు, పట్టణాల్లోని మెడికల్ ప్రాక్టీషనర్లపైనే ఆధారపడి వ్యాపారం సాగిస్తున్నాయి. రోగి చెల్లించే ఫీజుల నుంచి 30 నుంచి 50 శాతం వరకు కమీషన్లు ఇస్తున్నాయి. మరికొందరు అయితే మరో అడుగు ముందుకు వేసి ఒకరిద్దరు ఆర్ఎంపీ, పీఎంపీలు కలిసి అరువు వైద్యులతో పేద రోగుల నుంచి పెద్ద దోపిడీనే చేస్తున్నారు. గ్రామాల నుంచి రోగిని తీసుకొస్తే చాలు నీకింత.. నాకింత అనే ధోరణిలో వైద్య వ్యాపారం జోరుగా సాగుతోంది.

జిల్లా కేంద్రంలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ఆసుపత్రులు

జిల్లా కేంద్రంలోని గోదాం రోడ్డు సిరిసిల్లా రోడ్డులో ఏర్పాటు చేసిన పలు ఆసుపత్రులు ఆర్ఎంపీ, పీఎంపీ, మెడికల్ రిప్‌ల ద్వారా ఏర్పాటు చేసినవేననే విషయం బహిరంగ రహస్యం. అరువుకు తెచ్చిన వైద్యులకు టార్గెట్‌లు ఇస్తూ అవసరం లేకున్నా పరీక్షలు చేయించడం, జనరిక్ మందులను అధిక రేట్లకు అంటగడుతూ దోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒకరిద్దరు కలిసి ఒక ఆసుపత్రిని ఏర్పాటు చేయడం గ్రామీణ ప్రాంతంలో రోగాల భారిన పడిన వారి ఇంటింటికీ వెళ్లి కొద్దిరోజుల పాటు చికిత్సలు అందించడం హైడోస్‌ల వల్ల సైడ్ ఎఫెక్ట్‌లతో రోజుల తరబడి మంచానపడేలా చేస్తు వారిని వారు నెలకొల్పిన ఆసుపత్రులకు పంపిస్తూ కేవలం ఓపీ ఫీజులను మాత్రమే తక్కువగా తీసుకుంటూ స్కానింగ్, ఎక్స్‌రేలు, ఈఈజీలు, ఈసీజీలు అంటూ అవసరం లేకున్నా పరీక్షలు చేయిస్తూ కమీషన్ల రూపంలో దోపిడీ పర్వానికి తెరలేపుతున్నారని విమర్శలు వస్తున్నాయి. వీళ్ల వైద్యసేవలకు సైతం పలువురు వైద్యులు తాము వైద్యపట్టా పొంది హైదరాబాద్‌లలో నిపుణులైన వైద్యుల ఆసుపత్రులలో పనిచేసి చికిత్సలు అందిస్తున్న వారి దోపిడీ పర్వంపై అవాక్కవుతున్నామని అంటున్నారు. నిబంధనలు పాటించకుండా పుట్టగొడుగుల ఆసుపత్రులు వెలుస్తున్న వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది పట్టించుకోకపోవడం వల్లే ఒకరిని చూసి మరొకరు ఆసుపత్రులను ఏర్పాటు చేస్తున్నారని తెలుస్తోంది. నరాలకు సంబంధించిన ఓ వైద్యుడు అయితే ఎక్కడ ఏ చిన్న నొప్పి వచ్చిన ముందుగా మిషన్‌కు పని చెప్పి వేలల్లోనే డబ్బులు వసూళ్లు చేయడం జగమెరిగిన సత్యం. సదరు వైద్యుడు ఆసుపత్రికి వెళితే చాలు రూ.10వేలు ఖర్చు చేయనిదే బయటకు రామంటే అతిశయోక్తి కాదు. అవసరం మేరకు పరీక్షలు చేస్తే పర్వాలేదు కానీ ఓపీ అని వస్తే చాలు మిషన్లు పెట్టడం పరీక్షలు చేస్తు వేలల్లోనే వసూళ్లు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మెడికల్ టెర్మినాలజీ తెలియకున్నా..

అక్షరం ముక్క మెడికల్ టెర్మినాలజీ రాని పలువురు ఆర్ఎంపీ, పీఎంపీలు డాక్టర్ల పేరుతో చెలామణి అవుతున్నారు. ఇంటికి వచ్చి మందులు ఇచ్చే మెడికల్ ప్రాక్టీషన్ల వెనుక పెద్ద మాఫియానే నడుస్తోంది. కమీషన్లు,గిఫ్టులు, వాటాలు, స్టార్ హోటళ్లలో విందులు, విదేశీ ప్రయాణాలు ఇలా చెప్పుకుంటూ పోతే కొందరు ఆర్ఎంపీ, పీఎంపీలు అనుభవిస్తున్న రాజభోగం అంతా ఇంతా కాదు. కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు బాన్సువాడ, ఎల్లారెడ్డి ప్రాంతాల్లోని ఆర్ఎంపీ, పీఎంపీలకు 30 నుంచి 50 శాతం వరకు హాస్పిటళ్ల స్థాయిని బట్టి కమీషన్లు ఇచ్చి మరీ రోగులను ఆసుపత్రులకు రప్పించుకుంటున్నారు. ఇలాంటి కమీషన్లకు ఆశ పడుతున్న ఆర్ఎంపీలు రోగులను భయపెట్టి మరీ వారు చెప్పిన ప్రైవేట్ ఆసుపత్రులకు పంపిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నాచితక వైద్యం చేసుకునే ప్రాక్టీషనర్లు ప్రైవేట్ ఆసుపత్రులను, వైద్యులను శాసించే స్థాయికి ఎదిగారు. అవసరం లేకపోయినా రోగుల్ని ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులకు పంపించి అడ్డగోలు ఆపరేషన్లు చేయిస్తున్నారు. చిన్నపాటి జబ్బులకు కూడా రకరకాల పరీక్షలు చేయించి తమ వాటా తీసుకుంటున్నారు.

రిఫర్ చేసిన ఆసుపత్రికి వెళ్లకపోతే అంతే..

గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య లోపంతో దోమకాటు భారిన పడుతున్న ప్రజలు మలేరియా, డెంగ్యు, టైఫాయిడ్ వంటి వ్యాధులతో పాటు వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. రాత్రి సమయంలో ప్రభుత్వ వైద్యులు అందుబాటులో ఉండకపోవడం వ్యాధితో బాధపడుతున్న వారికి ఎక్కువ స్థాయిలో జ్వరం రావడంతో ఆర్ఎంపీ, పీఎంపీలను ఆశ్రయిస్తున్నారు. అందించిన కాడికి చికిత్సను అందిస్తూ జ్వరం తగ్గకపోతే తమకు కమీషన్లు ఇచ్చే ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు. ముఖ్యంగా రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండే చిన్న పిల్లలు ఎక్కువగా వ్యాధుల భారిన పడుతుండడంతో ఆసుపత్రులకు ఎక్కువ స్థాయిలో ఆదాయ మార్గంగా మారుతున్నారు. వారు రిఫర్ చేసిన ఆసుపత్రికి వెళ్లకపోతే ఆ తర్వాత రోగికి అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక చికిత్స అందించాల్సి ఉన్నా అటువైపు కన్నెత్తి చూడరనే విమర్శలు ఉన్నాయి. ఇంత తతంగం జరుగుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నరనే ఆరోపణలు వెలువడుతున్నాయి.





దివ్యాంగులకు పింఛన్లు అందజేయాలి

బోధన్‌రూరల్,జులై3: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులకు పింఛన్‌లు పెంచి ఇవ్వాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో బుధవారం బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఉపాధ్యక్షులు గైని రాములు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల్లో వికలాంగులకు 5శాతం రిజర్వేషన్ అమలు చేయాలని,ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కూడా ప్రాధాన్యత కల్పించి రిజర్వేషన్ అమలు చేయాలని అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. భూమి లేని వికలాంగులకు ప్రభుత్వం ఉచితంగా భూమిని అందజేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు షేక్.నసీర్, గౌరవ అధ్యక్షులు ఏశాల గంగాదర్, రాంపటేల్, మండల నాయకులు నజీముద్దీన్, గైని లక్ష్మణ్, సవిత, కవిత, లక్ష్మి, పోశవ్వ, దేవదాసు, ఒడ్డెన్న, రాములు, తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు

పదవులు శాశ్వతం కాదు

● ఎంపీడీవో రాజా శ్రీనివాస్

కమ్మర్‌పల్లి, జూలై 3: మనం చేపట్టిన పదవులు శాశ్వతం కాదని ప్రజా సేవలో మన ప్ర వర్తన ఆదర్శగా నిలుస్తుందని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజా శ్రీనివాస్ అన్నారు. బుధవారం కమ్మర్‌పల్లి మండలపరిషత్ ప్రజాపరిషత్ ప్రజాప్రతినిదుల (ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, జడ్పీటీసీ)పదవి కాలం ముగిసిన సందర్భంగా వారికి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గత ఐదు సంవత్సరాలు ప్రజాప్రతినదులుగా అభివృద్ధి కార్యక్రమాల్లో తమవంతుగా అందిం చిన సేవలనను గుర్తుచేసుకున్నారు. అనంతరం తహసీల్దార్‌తో కలిసి జడ్పీటీసీ రాధరాజగౌడ్, ఎంపీపీ లోలం గౌతమి, వైస్ ఎంపీపీ కలేరు శేఖర్, కోఆప్షన్ సభ్యుడు పాష, ఎంపీటీసీలు సుధాకర్, పిప్పెర అనీల్, దుబాక సుప్రియ, నోముల రజిత, తోట జ్యోతి, సుప్రియయాదవ్, గంగాధర్‌లను సన్మానించారు. కార్యక్రమంలో సూపరింటిండెంట్ షైలారం గంగాధర్, ఏపీఎం కుంట గంగారెడ్డి, కేబివి ప్రత్యేక అధికారి గంగామణి,ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆమేర్‌ఖాన్ , మం డలపరిషత్ అధికారులు పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయసిబ్బంది, ఈజీఎస్ సిబ్బంది, బిఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన

రెంజల్,జులై3: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను బుధవారం పంచాయతీరాజ్ డిప్యూటీ డీఈ రాజయ్య, ఎంపీడీవో శ్రీనివాస్‌లు పరిశీలించారు. పాఠశాలలో తాగునీటి సౌకర్యం, మరుగు దొడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులలో నిర్లక్ష్యం వహించకుండా నాణ్యత ప్రమాణాలతో పనులను చేపట్టాలని కాంట్రాక్టర్‌లకు సూచించారు. ఆయన వెంట ఎంపీవో గౌసోద్దీన్,పీఆర్ ఏఈ వినయ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజేందర్ రావు, ఉబేద్ తదితరులున్నారు.

సైబర్ నేరాల పట్ల విద్యార్థులకు అవగాహన

ఎల్లారెడ్డి, జూలై 3 : గుర్తు తెలియని వ్యక్తుల ఫోన్ నెంబర్ల నుంచి ఫోన్‌కాల్స్, ఎస్ఎంఎస్‌లు లింకులు వస్తే ఎట్టి పరిస్థితులలో మీ వ్యక్తిగత సమాచారాలు ఎవరికి చెప్పకూడదని ఎల్లారెడ్డి ఎస్ఐ బొజ్జ మహేష్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీరు గాని మీ తల్లిదండ్రులు గాని గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌లు చేస్తే స్పందించకూడదని ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే సైబర్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కు ఫోన్ చేయాలని తెలిపారు.

బీర్కూర్ : మండల కేంద్రంలోని కానప్ప చౌరస్తాలో బుధవారం సైబర్ నేరాల నియంత్రణపై పోలీసులు, స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు చేసే ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత వివరాలు, వోటీపీ, బ్యాంకు ఖాతా నెంబర్, ఆధార్ కార్డు వివరాలు ఎవరికి ఇవ్వకూడదని అన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఫోన్‌ల అప్పగింత

బీర్కూర్, జూలై 3 : బీర్కూర్, నసురుల్లాబాద్ మండలాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు ఇటీవల తన మొబైల్ ఫోన్లను పొగొట్టుకున్నారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ సాయంతో ఫోన్‌లను గుర్తించి రికవరీ చేశారు. బైరాపూర్, నసురుల్లాబాద్‌లకు చెందిన ముగ్గురు బాధితులను పీఎస్‌కు పిలిపించి ఏఎస్సై ఫోన్‌లను అందజేశారు.

మాజీ మేజర్‌కు ఘనస్వాగతం

పెద్ద కొడప్‌గల్, జూలై 3: పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రానికి చెందిన సీఆర్‌పీఎఫ్ సుబేదార్ మేజర్ అయిన బర్వాల్ అమర్ సింగ్ భారత సైన్యంలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసి గ్రామానికి చేరుకున్న సందర్భంగా బుధవారం గ్రామస్తులు, తండావాసులు ఘన స్వాగతం పలికారు. ఉద్యోగ విరమణ చేసి గ్రామానికి చేరుకున్న అమర్‌సింగ్‌కు గ్రామస్తులు కాటేపల్లి చౌరస్తా నుంచి ఆయన్ను తన ఇంటి వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు.

కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

బీబీపేట, జూలై 3: బీబీపేట మండలంలోని షేరి బీబీపేట గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త తాళ్ల దేవరాజ్‌గౌడ్ తండ్రి తాళ్ల బాల్‌రాజ్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి పరామర్శించారు. ఆపద సమయంలో అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీజేపీ నాయకులు రంజిత్‌గౌడ్, మల్లేషం, పోసు శివ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వాలి

● సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు రమేష్‌బాబు

పెద్దబజార్, జూలై 3: అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనాలు కల్పించాలని, సౌకర్యాలను మెరుగుపర్చాలని అంగన్‌వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు రమేష్‌బాబు అన్నారు. బుధవారం నగరంలోని ధర్నాచౌక్ వద్ద సమస్యలను పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన మెమో నంబరు 1334ను తక్షణమే ఉపసంహరించుకోవాలని అదేవిధంగా అంగన్‌వాడీ ఉద్యోగులను గత సెప్టెంబర్ నెలలో నిర్వహించిన 24 రోజుల సమ్మె సందర్భంగా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం మంత్రులు అధికార సమక్షంలో ఇచ్చిన హామీ మేరకు 65 సంవత్సరాలు నిండిన టీచర్లకు 2లక్షల రూపాయలు, ఆయాలకు లక్ష రూపాయలు రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడానికి అంగీకరించడంతో పాటు ఆసరా పెన్షన్ రిటైర్డ్‌మెంట్ ఉద్యోగులందరికీ అమలు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. జారీ చేసిన సర్క్యులర్‌లో జీవో నంబర్ 10 ప్రకారం 65 సంవత్సరాలు నిండిన వారందరికి రిటైర్డ్‌మెంట్ ప్రకటించాలని జూలై 1వ తేదీ నుంచి వారికి జీతాలు ఇవ్వబడవని సర్క్యులర్ జారీ చేయడం జరిగిందన్నారు. జీవో ప్రకారం టీచర్‌కు లక్ష రూపాయలు, ఆయాకు 50వేల రూపాయలు మాత్రమే చెల్లిస్తామని అందులో పేర్కొనడం జరిగిందన్నారు. అనంతరం ధర్నా శిబిరానికి వచ్చిన ఐసీడీఎస్ పీడీకి మెమోరాండం ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడి యూనియన్ జిల్లా నాయకులు దేవగంగు, శంకర్‌గౌడ్, చంద్రకళ, సూర్యకళ, శివరాజన్న, కరుణ, ఎలిజబెత్ రాణి, జ్యోతి, సరిత, గోదావరి, తదితరులు పాల్గొన్నారు.

పాతూర్ యూత్ గణేష్ మండలి కార్యవర్గం ఎన్నిక

నందిపేట, జూలై 3: మండల కేంద్రంలోని శ్రీ ఓంకార రూపిణి దురాదేవి మండపంలో బుధవారం పాతూర్ యూత్ గణేష్ మండల నూతన కార్యవర్గం ఏర్పాటైంది. అధ్యక్షులుగా నాశేశ్వర్ మహేష్, ఉపాధ్యక్షులుగా బర్కి విజయ్, కొహినూర్ అక్షయ్, కోశాధికారులుగా ఏర్రం పవన్, ఏర్రం హరీష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. నూతన కమిటీకి బాధ్యతలు అప్పగించారు. లావాదేవీలు సరిచేసుకున్నారు. కొత్తగా ఏర్పాటైన కార్యవర్గాన్ని సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఏర్రం కొత్తూర్ సాగర్, కొహినూర్ అనిల్ కుమార్, కొత్తపేట రాజు, నడ్కుడ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

వ్యాక్సిన్‌లు అందించడంలో నిర్లక్ష్యం తగదు

● డీఐవో డాక్టర్ అశోక్ కుమార్

కమ్మర్‌పల్లి, జూలై 3: పిల్లలకు నెలవారిగా వ్యాక్సిన్ అందించడంలో ఏమాత్రం నిర్లక్ష్య పనికిరాదని, ప్రతీనెల తప్పకుండా వ్యాక్సిన్ అందేలా చూడాలని జిల్లా ఇమ్యూనైజేషన్ (డీఐవో) అధికారి డాక్టర్ అశోక్ అన్నారు. బుధవారం కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలోని చౌట్‌పల్లి, హసాకొత్తూర్ ఆరోగ్య ఉపకేంద్రాలలో ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉపకేంద్రాలలోని వ్యాక్సిన్ రికార్డులను పరిశీలించారు. ప్రతినెల పిల్లలకు అందజేస్తున్న వ్యాక్సిన్ వివరాలను స్థానిక ఏఎన్ఎంలు శ్యామల, గీతలను అడిగి తెలుసుకున్నారు. పుట్టి నుంచి 5 సంవత్సరాల వయస్సు పిల్లలకు వేసే వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయని వ్యాక్సిన్ పిల్లలకు వేయడంలో ఎంతమాత్రం నిర్లక్ష్యంగా వ్యహరించవద్దన్నారు. ఈ విషయంలో అశ్రద్ధ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆకస్మిక తనిఖీ చేపట్టిన డీఐవో వెంట జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ తరుణ్, ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ సుప్రియ, హెచ్ వో సత్యనారాయణ, ఫార్మాసిస్టు రవికుమార్, డీఈవో మధు, హెల్త్‌అసిస్టెంట్ జగదీష్ ఆయా గ్రామాల ఆశావర్కర్లు ఉన్నారు.





'ప్రజాప్రతినిధుల సేవలు మరువలేనివి'

బీబీపేట, జూలై 3: ప్రజా ప్రతినిధుల సేవలు మరువలేనివని జడ్పీటీసీ ప్రేమ్‌కుమార్ అన్నారు. బుధవారం బీబీపేట మండల ఎంపీపీ, ఎంపీ టీసీల పదవీకాలం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతినిత్యం గ్రామప్రజలకు అండగా ఉంటూ వారికి ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించి సేవలు చేశారని తెలిపారు. ప్రజలకు సేవ చేసినవారిని వచ్చే ఎన్నికలలో ప్రజలే గెలిపించుకుంటారని తెలిపారు. అనంతరం ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలను ఎంపీడీవో పూర్ణ చంద్రో యకుమార్ సన్మానించారు. కార్యక్రమంలో ఐడీసీఎంఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, తహసీల్ధార్ సత్యనారాయణ, ఎంపీపీ బాలమణి, వైస్ఎంపీపీ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

రామారెడ్డి, జూలై 3 :రామారెడ్డి మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు అటికెల మల్లేష్ తండ్రి అటికెల నర్సయ్య మృతి చెందడంతో ఆయన కుటుం బాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే సురేందర్ పరామర్శిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి మరణం పట్ల ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని అన్నారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని కోరుతు న్నామ న్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రంగు రవీందర్‌గౌడ్, నాయకులు కాసర్ల రాజేందర్, శ్రీనివాస్, బాల్‌దేవ్, అంజయ్యరెడ్డి, నాయకులు మల్లేష్ యాదవ్, కిషన్ యాదవ్, పాలమల్లేష్ పాల్గొన్నారు.

లింగంపేట గ్రామపంచాయతీ తైబజార్ వేలం

లింగంపేట, జులై 3 : లింగంపేట గ్రామపంచాయతీలో తైబజార్ వేలం నిర్వ హించారు. రూ.4లక్షల 80వేలకు గ్రామానికి చెందిన అర్షద్ పాషా దక్కించు కున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్ తెలిపారు. వేలం పాటలో అత్యధి కంగా వేలం పాడిన అర్షద్‌పాషాకు సంవత్సరం వరకు తైబజార్‌లో డబ్బులు వసూలు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు.

నేడు ఆదర్శ పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు

జక్రాన్‌పల్లి, జూలై3: మండల కేంద్రంలోని జక్రాన్‌పల్లిలో ఆదర్శ పాఠశాల, కళాశాలలో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. 6 నుంచి 10వ తరగతి వరకు, అలాగే ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరంలో మిగిలి ఉన్న సీట్ల భర్తీ ఈనెల 4న స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆదర్శ పాఠశాలలో, కళాశాలలో ఆసక్తి గల విద్యార్థులు టీసీ, బోనాఫైడ్, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలతో ఫోటోలతో గురువారం పాఠశాలలో ఉదయం 10గంటలకు హాజరుకావాలన్నారు. ఆర్మూర్, ఇతర ప్రాంతాల నుంచి జక్రాన్‌పల్లికి అప్ అండ్ డౌన్ చేసే సౌకర్యం ఉన్న విద్యార్థులు కూడా ఇంటర్మిడియేట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, సీఈసీలో అడ్మిషన్‌లకు అవకాశం ఉందన్నారు. ఆర్మూర్, నిజామాబాద్ నుంచి ఈ పాఠశాలకు, కళాశాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉందన్నారు. చదువుకునే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫాం ఇవ్వడం జరుగుతుందన్నారు.

'జికా'...వస్తోంది జాగ్రత్త

రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం.. మహారాష్ట్రలో పెరుగుతున్న కేసులతో ఆందోళన

- సంసిద్ధంగాలేని తెలంగాణ వైద్యశాఖ
- కనీస చర్యలూ తీసుకోని వైనం
- ఇప్పటికే రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల విజృంభణ



హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రం మహారాష్ట్రలో జికా వైరస్ విజృంభిస్తోంది. రెండు రోజుల క్రితం పుణెలో ఒక్క రోజే ఆరు జికా వైరస్ వ్యాధి (జడ్‌వీడీ) కేసులు నమోదుకావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దీంతో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం బుధవారం అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఈమేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్‌ఎస్) డాక్టర్ అతుల్‌గోయల్ అడ్వైయిజరీ జారీ చేశారు. జికాపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా గర్భిణులను స్ర్కీనింగ్ చేయాలని కేంద్రం కోరింది. జికా వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన గర్భిణుల్లో పిండం ఎదుగుదలను పర్యవేక్షించాలని సూచించింది. ప్రతి ఆస్పత్రిలో కచ్చితంగా ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని, ఆ అధికారి జికా వైరస్ వ్యాప్తికి కారణమయ్యే దోమల పెరుగుదల నివారణకు చర్యలు చేపట్టాలని కోరింది. జికా కేసులు నమోదైతే వెంటనే నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీవీబీడీసీ)కు రిపోర్టు చేయాలని, అనుమానిత నమూనాలను పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపాలని సూచించింది. అలాగే ఐసీఎంఆర్ ఆధ్వర్యంలోని వైరస్ పరిశోధనా కేంద్రాలకు కూడా శాంపిళ్లను పంపాలని ఆదేశించింది.

అప్రమత్తంగాలేని రాష్ట్ర వైద్యశాఖ..

మహారాష్ట్ర నుంచి తెలంగాణకు రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి మహమ్మారులు వచ్చినప్పుడు వాటిని నియంత్రించే బాధ్యత క్షేత్రస్థాయిలో ప్రజారోగ్య సంచాలకులకే ఉంటుంది. అయితే మన వద్ద ఇంతవరకు అందుకు సంబంధించిన కార్యాచరణేమీ కానరావడంలేదు. ఇప్పటికే రాష్ట్రంలో ఒకవైపు డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల విజృంభణ మొదలైంది. గత ఐదు నెలల్లో మలేరియా, డెంగ్యూ మరణాలు కూడా సంభవించాయి. పటిష్ఠ పర్యవేక్షణ లేకపోవడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో వీటిపై అవగాహన ఉన్న విభాగాధిపతి లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందని వైద్యవర్గాలు చెబుతున్నాయి. అందుకే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దోమల ద్వారా వ్యాప్తి..

జికా వైరస్ అనేది దోమల ద్వారా సంక్రమించే ఫ్లేవి వైరస్. జికా ప్రధానంగా ఏడెస్ దోమల కాటు ద్వారా వ్యాపిస్తుంది. ఇదే దోమ కుడితే డెంగ్యూ, చికున్‌గున్యా, ఎల్లో ఫీవర్ వైరస్‌లు కూడా సోకుతాయి. జికా సోకితే సాధారణ లక్షణాలే ఉంటాయి. ఇవి 2-7 రోజులపాటు కనిపిస్తాయి. ముఖ్యంగా జ్వరం, దద్దుర్లు, కీళ్ల నొప్పి, కండ్లకలక (ఎరుపు కళ్లు), కండరాలు, తలనొప్పితో పాటు మరికొన్ని తీవ్రమైన సమస్యలు కలుగుతాయి. మైక్రోసెఫాలీ (పుట్టుక లోపం), గులియన్ బారే సిండ్రోమ్ (న్యూరోలాజికల్ డిజార్డర్), మెనింజైటిస్ (మెదడు, వెన్నెముక లైనింగ్ వాపు)లాంటి వాటికి కారణమౌతుంది.

నివారణ ఎలాగంటే..

దోమల వృద్ధిని నివారించడానికి ఇళ్లు, బహిరంగ ప్రదేశాల చుట్టూ నిలిచిన నీటిని తొలగించాలి. జికా కూడా లైంగికంగా సంక్రమించే అవకాశం ఉన్నందున సురక్షితమైన విధానాలను పాటించాలి. జికాకు నిర్దిష్ట చికిత్స లేదు, కానీ లక్షణాల ఆధారంగా చికిత్సను అందిస్తారు. జికా లక్షణాలు కనిపిస్తే వెంటనే సరైన రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని డాక్టర్‌ను సంప్రదించాలి.

'మాటిచ్చా.. సరస్వతి గుడిని నిర్మించా'

- 'ఆంధ్రజ్యోతి'తో సినీ గేయ రచయిత చంద్రబోస్
- ఆయన స్వగ్రామం చల్లగరిగలో 'ఆస్కార్ గ్రంథాలయం'



ఆస్కార్ గ్రంథాలయం

చిట్యాల, జూలై 3: ఆస్కార్ అవార్డు గ్రహీత, సినీ గేయ రచయిత కనుకుంట్ల చంద్రబోస్ తన గ్రామ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. తన స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగ గ్రామంలో సొంత నిధులతో ఆస్కార్ పేరిట ఓ గ్రంథాలయాన్ని నిర్మించారు. ఈ ఆస్కార్ గ్రంథాలయ ప్రారంభోత్సవం గురువారం జరగనుంది. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో బుధవారం ఫోన్‌లో మాట్లాడిన చంద్రబోస్.. 'గ్రామస్థులకు ఇచ్చిన మాట ప్రకారం సరస్వతి గుడిని నిర్మించా. చాలా సంతోషంగా ఉంది' అని ఆనందం వ్యక్తం చేశారు. చల్లగరిగలోని తమ ఇంటి పక్కన ఉన్న గ్రంథాలయంలో ఎన్నో సాహిత్య పుస్తకాలు చదివానని, వాటి వల్లే తాను ఉన్నత స్థాయికి ఎదిగానని ఈ సందర్భంగా చెప్పారు. ఆర్ఆర్ఆర్ సినిమాకు తాను రాసిన నాటునాటు పాటకు ఆస్కార్ అవార్డు రావడంతో బాల్య మిత్రులు, గ్రామ ప్రజలు తనని సన్మానించారని చెప్పారు. ఆ సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతూ గ్రామంలో అత్యాధునిక హంగులతో గ్రంథాలయ భవనం నిర్మిస్తానని ఇచ్చిన మాటను ఈ రోజున నిలబెట్టుకున్నానని వివరించారు. అందరి సహకారంతో రూ. 36లక్షల వ్యయంతో ఎనిమిది నెలల్లో భవనాన్ని సిద్ధం చేసి ఆస్కార్ గ్రంథాలయం అని నామకరణం చేశామని చెప్పారు. కాగా, రచయిత చంద్రబోస్ తన సొంత నిధులతో నిర్మించిన ఆస్కార్ గ్రంథాలయ ప్రారంభోత్సవం గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని గ్రంథాలయాల జిల్లా కార్యదర్శి శ్రీలత తెలిపారు.

ఇద్దరు రైతుల ఉసురు తీసిన అప్పులు

పెంబి రూరల్, బొంరాస్‌పేట్, జూలై 3: పంటల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డాడు. నిర్మల్ జిల్లా పెంబి మండలం యాపల్‌గూడ గ్రామానికి చెందిన రైతు అర్క సంతోష్ (28) తనకున్న ఎకరంతో పాటు నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంట వేశాడు. ఇందుకోసం రూ.లక్షల్లో అప్పు చేశాడు. పత్తి విత్తనా లు మొలకెత్తకపోవడంతో పాటు చేసిన అప్పులు తీర్చాలని బాకీలు ఇచ్చిన వారు వేధించడంతో మనస్తాపానికి గురై మంగళవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వికారాబాద్ జిల్లా మెట్లకుంట గ్రామానికి చెందిన బైరం నర్సింహులు(62)కు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వారి వివాహాల కోసం చేసిన అప్పులు తీర్చేందుకు తనకు ఉన్న రెండు ఎకరాల పొలంలో ఎకరన్న సీలింగ్ భూమిని అమ్మకానికి పెట్టగా కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపంతో బుధవారం ఉరేసుకున్నాడు.

ఉస్మానియా ఆస్పత్రిలో విద్యుత్ అంతరాయం

- టార్చ్‌లైట్ల వెలుగులో శస్త్రచికిత్సలు

మంగళ్‌హాట్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రిలో బుధవారం మధ్యాహ్నం విద్యుత్ నిలిచిపోవడంతో రోగులు, వైద్యులు ఉక్కిరిబిక్కిరయ్యారు. శస్త్రచికిత్సలు చేసే సమయంలో అంతరాయం కలగడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ నిలిచిన వెంటనే ప్రారంభం కావాల్సిన జనరేటర్లు సైతం మొరాయించాయి. సిబ్బంది వెంటనే విద్యుత్ విభాగం నిపుణులను రప్పించి అరగంట తర్వాత సేవలను పునరుద్ధరించారు. దీంతో అప్పటివరకు సెల్‌ఫోన్, టార్చ్‌లైట్ల వెలుతురులోనే శస్త్రచికిత్సలను కొనసాగించినట్లు సమాచారం.

కుటుంబాన్ని మింగేసిన మద్యం రాకాసి

- మద్యానికి బానిసైన భర్త వేధింపులు తాళలేక.. ముగ్గురు కుమార్తెలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ తల్లీ, ఓ కూతురు మృతి మిగిలిన ఇద్దరి పరిస్థితి విషమం

కాగజ్‌నగర్, జూలై 3: ఐదుగురు ఆడపిల్లల తండ్రి అయిన ఓ వ్యక్తి బాధ్యతలు మరచి మద్యానికి బానిసై వేధింపులకు గురి చేస్తుండడంతో జీవితంపై విరక్తి చెంది అతని భార్యాబిడ్డలు ఆత్మహత్యకు యత్నించారు. భార్య, ఓ కుమార్తె మరణించగా మరో ఇద్దరు కూతుళ్ల పరిస్థితి విషమంగా ఉంది. ఇలా కుమరం భీం జిల్లా కాగజ్‌నగర్ మండలం గజ్జిగూడ గ్రామానికి చెందిన ఓ కుటుంబాన్ని మద్యం మింగేసింది. వివరాలిలా ఉన్నాయి. గజ్జిగూడకు చెందిన ప్రతాప్‌కు భార్య అనిత(55), ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో పెద్ద కూతురికి వివాహమవ్వగా లక్ష్మి(21), రవళి(18), రమ్య(16), ఐశ్వర్య(14) ఇంటి వద్దే ఉంటున్నారు. మద్యానికి బానిసైన ప్రతాప్ తాగిన మైకంలో గ్రామస్థులతో నిత్యం గొడవలు పడుతుండేవాడు. ఆర్థిక ఇబ్బందులతో తమకున్న వ్యవసాయ భూమిలో కొంత భాగాన్ని అమ్మేశాడు. మిగిలిన కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తూ అనిత కుటుంబాన్ని పోషించేది. ఈ క్రమంలో 15 రోజుల క్రితం పొలం వద్ద జరిగిన గొడవలో భాగంగా ప్రతాప్ ఓ వ్యక్తిపై గొడ్డలితో దాడి చేశాడు. దీంతో హత్యాయత్నం కేసులో ప్రతాప్ జైలుకెళ్లాడు. అయితే, గ్రామ ప్రజల సాయంతో ప్రతాప్‌కు బెయిల్ ఇప్పించిన అనిత భర్తను జైలు నుంచి బయటకు తీసుకొచ్చింది. ఆ తర్వాత కూడా ప్రతాప్ తీరుమారకపోవడంతో మద్యం మానేయాలంటూ అనిత సోమవారం గొడవపడింది. ఇందుకు ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రతాప్ భార్య అనితపై దాడి చేసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన అనిత.. కుమార్తెలు రమ్య, లక్ష్మీ, ఐశ్వర్య, రవళితో కలిసి పొలానికి వెళ్లి ఆత్మహత్య చేసుకుందామని చెప్పింది. రవళి మినహా తల్లీకూతుళ్లు అందరూ పురుగు మందు తాగేశారు. రవళి కేకలు విని అక్కడికి వచ్చిన చుట్టుపక్కల పొలాల్లోని వారు అనిత, ఆమె కుమార్తెలను ఆస్పత్రికి తరలించారు. అయితే, రెండ్రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనిత, రమ్య బుధవారం మృతి చెందారు. లక్ష్మీ, ఐశ్వర్య పరిస్థితి విషమంగా ఉంది. మరోపక్క, ప్రతాప్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

పిడుగుపాటు కాదు.. అంతర్గత లోపమే!

- 'భద్రాద్రి పవర్ ప్లాంట్' ప్రమాదంపై తేల్చిన జెన్‌కో..

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ప్రమాదానికి అంతర్గత లోపాలే కారణమని తేలింది. పిడుగుపాటు వల్ల ప్రమాదం జరగలేదని జెన్‌కో స్పష్టం చేసింది. భద్రాద్రి పవర్ ప్లాంట్ ఒక్కోటి 270 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లు (1080 మెగావాట్లు) ఉండగా.. అందు లో 270 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్-1లోని జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ గత శనివారం అగ్నిప్రమాదం జరిగి కాలిపోయింది. అయితే దీనికి పిడుగుపాటే కారణమని తొలుత ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ జెన్‌కో అధికారులతో విచారణ జరిపించారు. పిడుగు పడిన సమయంలోనే యాదృచ్ఛికంగా జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ అంతర్గత లోపాలతో, దాని లోపల మంటలు ఉత్పన్నమయ్యాయని, ఇందుకు బాహ్య కారణాలు లేవని తేల్చారు. దీనిపై ప్రభుత్వానికి జెన్‌కో తాజాగా ఓ నివేదిక సమర్పించింది. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఓ వ్యవస్థ దెబ్బతిని.. ఆయిల్ లీకేజీ చోటుచేసుకుని పూర్తిగా దగ్ధమైందని అందులో అధికారులు వివరించారు. ప్రాథమిక అంచనా ప్రకారం రూ.30 కోట్లకు పైగా నష్టం జరిగినట్టు ఇప్పటికే ఓ నిర్ధారణకు వచ్చారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్‌ను పూర్తిగా విప్పి పరిశీలించిన తర్వాత నష్టంపై పూర్తి స్పష్టత రానుందని ప్రభుత్వానికి జెన్‌కో నివేదించింది. ట్రాన్స్‌ఫార్మర్‌లో అంతర్గత లోపాలు ఏర్పడడానికి నిర్మాణ, నిర్వహణ, పర్యవేక్షణ లోపాలు కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు.



సిద్దిపేట జిల్లా రాయపోల్‌లో గుర్తించిన సిడితల వీరగల్లు

తల నరుక్కొంటే.. శివ సన్నిధికి చేరుకుంటామని..

- చాళుక్యులు, రాష్ట్రకూటుల కాలంలో శైవుల్లో ఈ విశ్వాసం
- 'సిరితల వీరగల్లు'గా ప్రశస్తి.. సిద్దిపేట జిల్లా రాయల్‌పోల్‌లో విగ్రహం లభ్యం

రాయపోల్, జూలై 3: ప్రాణార్పన చేస్తే దేవుడి సన్నిధికి చేరుకుంటామని నమ్మడం.. ఓ పదునైన ఆయుధంతో తమ తలను తామే నరుక్కోవడమో.. మరొకరితో నరికించుకోవడమో చేయడం గురించి విన్నారా? 6వ శతాబ్దం నుంచి 12వ శతాబ్దం వరకు నడిచిన చాళుక్యుల కాలంలో, అప్పట్లోనే రాష్ట్రకూటుల హయాంలో శైవభక్తుల్లో ఈ విశ్వాసం ఉండేదట! భాసింపట్టు వేసుకున్న స్థితిలో తలపైన ఉన్న జుట్టు సాయంతో తాటిచెట్టుకో.. వెదురు చెట్టుకో వేలాడుతున్న వ్యక్తితో ఉన్న ఆ శిల్పాన్ని చూస్తున్నారా? ఆ వ్యక్తి చేతులు ముకుళితమై ఉన్నాయి. తల నుంచి మొండెం వేరయినట్లుగా మధ్యలో గ్యాప్‌ను స్పష్టంగా గమనించొచ్చు! ఈ శిల్పాన్ని 'సిడితల వీరగల్లు' అంటారు. శైవభక్తులు ఆత్మబలిదానాలను ధర్మకార్యంగా భావించేవారు. శివసన్నిధికి చేర్చే తక్షణ మార్గంగా ఆత్మబలిదానాలను ఎంచుకునేవారు. పైగా తల నరుక్కొని మరణిస్తే, తమ ప్రాణాలను తీసుకెళ్లేందుకు దేవాంగనలు వస్తారని విశ్వసించేవారు. ఈ శిల్పంలో.. పైన ఇద్దరు మహిళలుండటాన్ని గమనించవచ్చు! ఫొటోలో కనిపిస్తున్న ఈ 'సిడితల వీరగల్లు' సిద్దిపేట జిల్లా రాయపోల్‌లోని పురాతన గణపతి ఆలయం ప్రాంగణంలోనిది. దీన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ గుర్తించి.. వివరించారు. మహిళా సిడితల వీరగుల్లులు జనగామ జిల్లా లింగపల్లిలో లభించాయి. పురుష సిడితల వీరగల్లులు ఇప్పటి దాకా యాదాద్రి జిల్లా చొల్లేరులో, వనపర్తి జిల్లా కేంద్రంలో లభించగా రాయపోల్‌లోనిది మూడోది. ఇక సిడితల వీరగల్లులు కాకుండా కేవలం వీరగల్లులూ ఉంటాయి. తోటి ప్రజలను, పాడిపశువులను కాపాడే క్రమంలో అడవి జంతువులతో పోరాడి చనిపోతే, యుద్ధాల్లో పాల్గొని ప్రాణాలు కోల్పోతే వారిని వీరగల్లుగా చెక్కి ప్రజలు ఆరాధించేవారు.

పెంటారెడ్డి పదవీకాలం ఆర్నెల్లు పొడిగింపు

నీటిపారుదలశాఖలో ఎత్తిపోతల పథకాల సలహాదారుడు కె.పెంటారెడ్డి పదవీ కాలాన్ని మరో ఆర్నెల్ల పాటు పొడిగిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెంటారెడ్డి పదవీకాలం పొడిగింపు నిర్ణయం మే 16 నుంచి ఆరునెలల పాటు అమలులో ఉండనుంది.

మంత్రి పొంగులేటిని కలిసిన డీసీసీబీ చైర్మన్



మంత్రి పొంగులేటిని కలిసిన డీసీసీబీ చైర్మన్

నిజామాబాద్ అర్బన్, జూలై 3: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డినిబుధవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ రమేష్‌రెడ్డి బుధవారం కలిశారు. బ్యాంకులకు సంబంధించిన పరిస్థితిని వివరించారు. ఉమ్మడి జిల్లాల పరిధిలో ఎన్ని సహకార సొసైటీలు ఉన్నాయి, వాటి పరిధిలో జరిగే బ్యాంకు లావాదేవీలను వివరించడంతో పాటు ఆర్థిక పరిస్థితిని కూడా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బ్యాంకు రుణాలు తీసుకున్న రైతులకు సంబంధించి కొంత మందివి ధరణిలో పూర్తిస్థాయిలో ఎంట్రీ కాలేదని వాటికి అవకాశం ఇవ్వాలని మంత్రిని ఆయన కోరారు. సానుకూలంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పందించినట్లు ఆయన తెలిపారు.

ఏర్గట్ల అయ్యప్ప స్వామి ఆలయం వద్ద అన్నదానం

ఏర్గట్ల, జూలై 3: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద బుధవారం స్వామి వారికి అభిషేకం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ సమితీ సభ్యులు మాట్లాడుతూ ప్రతీ బుధవారం దాతల సహకరంతో అన్నధాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఆలయం వద్ద దోంచంద గ్రామానికి చెందిన ఎర్ర శేషేందర్ వనజ, సాహితీ, శ్రీనివాస్‌లు ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గుల్లె రాజేశ్వర్, భక్తులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

సిరికొండ,జూన్3:కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలండర్‌ను ప్రకటించి నిరుద్యోగులైన యువతి యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనిప్రభుత్వాన్ని బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి సీహెచ్.శ్రావణ్‌రెడ్డి కోరారు. బీజేవైఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిరికొండ తహసీల్దార్ రవీందర్ రావుకు బుధవారం బీజేవైఎం మండల కమిటీ వినతి పత్రాన్ని అందజేశారు. శ్రావన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రూప్ 1 ప్రిలిమ్స్‌లో 1:100 ప్రకారం క్వాలీఫై చేయాలని,గ్రూప్ 2, గ్రూప్ 3 నోటిపికేషన్లలో అదనపు పోస్టులను పెంచాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 25వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నోటిపికేషన్ జారీ చేయాలని పరీక్షలను వాయిదా నూతన తేదీలను ప్రకటించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.కానిస్టేబుల్ నియామకాల్లో అన్యాయం జరుగుతున్న జీవోఎంఎస్ నెం.46ను రద్దు చేయాలని శ్రావన్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.గోపి,అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఆరుగురు విద్యార్థుల ఎంపిక

ధర్పల్లి, జూలై3: బాసర ట్రిపుల్ ఐటికి మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రాజేందర్ సాహెబ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన మెగావత్ పల్లవి, లోలం మేఘన, చాట్ల చందన, దాబవత్ అంకిత, లక్మ అక్షయ, లొడియా వసుందరలు ఎంపికైనట్టు పేర్కొన్నారు. బుధవారం ప్రకటించిన ట్రిబుల్ ఐటి ఫలితాల్లో మోడల్ పాఠశాల విద్యార్థుల ఎంపిక పట్ల ఉపాధ్యా యులు, ఏఏపీసీ సభ్యులు విద్యార్థులను అభినందనలు తెలిపారు.

రుద్రూరులో సైబర్ నేరాలపై అవగాహన

రుద్రూరు,జూలై3: రుద్రూరు మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో బుధవారం రాత్రి సైబర్ నేరాల నియంత్రణపై ఎస్ఐ అప్పారావు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు చేసే ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత వివరాలు, ఓటీపీ, బ్యాంకు ఖాతా నెంబర్, ఆధార్ కార్డు వివరాలు ఎవరికి ఇవ్వకూడదని అన్నారు. ఈకార్యక్రమంలో రుద్రూరు పోలీసు సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన టీఎన్‌జీవోస్ జిల్లా నాయకులు



మంత్రిని కలిసిన టీఎన్‌జీవోస్ నేతలు

సుభాష్‌నగర్, జూలై 3: మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్కలను టీఎన్‌జీవోస్ జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం హైదరాబాద్‌లోని మంత్రుల కార్యాలయంలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలను మంత్రుల ముందు ఉంచారు. త్వరలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు జిల్లా టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు అలుక కిషన్ తెలిపారు. అంగన్‌వాడి టీచర్ల సమస్యలు వయస్సు సడలింపుపై సీతక్కకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్, కార్యదర్శి నేతికుంట శేఖర్, బాధ్యులు పోల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు జాఫర్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మోస్రా సర్వసభ్య సమావేశం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

మోస్రా,జులై3: మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీపీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ముందుగా ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ ప్రజా ప్రతినిధులను, అధికారులను వేదిక మీదకు ఆహ్వానించారు. జడ్పీటీసీ ఆధ్వర్యంలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ పరిధిలోని సమస్యలు పరిష్కారం దిశగా మాట్లాడారు. ఈ సందర్భంగా పలు సమస్యలు లేవనెత్తి పరిష్కారం చేయాలని కోరారు. ఇందులో భాగంగా జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం ముగిసిన సందర్భంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, మండల అధికారులు, కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు వారిని శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాము ఇచ్చి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మోటాడిరెడ్డి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ ఉమారాములు, వైస్ ఎంపీపీ శంకర్, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ మారుతీ, ఏపీవో సురేష్, అటవీశాఖ అధికారి వినయ్, విద్యుత్ శాఖ అధికారి మిధున్, మిషన్ భగీరథ సాత్విక, ఎంపీఓ రఫీ, చింతకుంట మాజీ సర్పంచ్ విమల లింగయ్య, గోవూర్ మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ముతీబ్, భూమేష్, ప్రేమ్, కృష్ణ, మహేశ్వరి, టెక్నికల్ అసిస్టెంట్ అంబర్‌సింగ్, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులకు వీడ్కోలు



ఎంపీపీ, ఎంపీటీసీలకు వీడ్కోలు సన్మానం చేసిన అధికారులు

మోర్తాడ్, జూలై3: మోర్తాడ్ మండల పరిషత్‌లో ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులకు వీడ్కోలు వేడుక జరిపారు. మోర్తాడ్ మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడు శివలింగు శ్రీనివాస్, ఎంపీటీసీసభ్యులకు బుధవారం మండల అధికారులు ఘనంగా వీడ్కోలు జరిపారు. వీడ్కోలు సమావేశంలో మండల స్థాయి అధికారులు పాలకవర్గం ఐదేళ్ల పాటు సమర్థవంతంగా పని చేసిందని, అధికారులకు అభివృద్ధిలో సహకరించారని పలువురు అధికారులు కొనియాడారు. ఈ ఎంపీపీ శివలింగు శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోనే ఉత్తమ మండలం ఎన్నికకు అధికారులు ఎంతగానో సహకరించారని, అభివృద్ధిలో అధికారుల సహకారం ఎంతో ఉందని అన్నారు. పాలకవర్గం కలిసి పని చేశామని అన్నారు. ఐదేళ్ళ పాటు ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయని మండల స్థాయి అధికారులు, మండల ప్రజల సహకారం ఉందన్నారు. తమ పదవీకాలం పూర్తయిన ప్రజా జీవితంలో ఉంటామని, ప్రజలకు సేవ చేస్తానని ఆయన అన్నా రు. అనంతరం ఎంపీపీ శివలింగు శ్రీనివాస్ ఎంపీటీసీసభ్యులను పూల మాలలు, శాలువ, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. అంతేగాక మండలస్థాయి అధికారులను ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తిరుమల తహసీల్దార్ సత్యనారాయణ, ఎంఈవో ఆంధ్రయ్య, కేఈఈ స్వరాజ్, వ్యవసాయాధికారి లావణ్య, ఏపీవో శకుంతల, ఏపీఎం ప్రమీల, ఐసీ డీఎస్ అధికారిణి ఉషారాణి, పంచాయతీ కార్యద ర్శులు సూపరిండెంట్ లింగయ్య, తదితరులు ప్రసంగించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి వి.ప్రభాకర్

ఆర్మూర్‌రూరల్, జూలై3: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజా పంథా రాష్ట్ర కార్యదర్శి వి.ప్రభాకర్, ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి బి.దేవరాంలు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలు వంద రోజుల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఆరు నెలలు కావస్తున్న పూర్తిస్థాయిలో అమలు చేయడంలేదని విమర్శించారు. రైతు భరోసా, విధివిధానాలను రూపొందించడానికి వేసిన సబ్‌కమిటీ కనీసం రైతు సంఘాలను, రైతులతో సమావేశంలో నిర్వహించడంలేదన్నారు. సాగు చేయని భూములకు రైతు భరోసా ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. సాగు చేసే పోడు రైతులకు పేద, మధ్యతరగతి రైతులకు పది ఎకరాల లోపు ఉన్న రైతులకు రైతు భరోసా వర్తింప జేయాలని వారు డిమాండ్ చేశారు. సన్న ధాన్యం కాకుండా అన్ని పంటలకు రూ.500బోనస్ ఇవ్వాలని, ఖరీఫ్ సీజన్‌కు ముందే వ్యవసాయ రుణాలు మాఫీ చేసే కొత్త రుణాలు పొందే అవకాశం రైతులకు ఉండేదన్నారు. ఐఎఫ్‌టీయు జిల్లా అధ్యక్షుడు ముత్తెన్న, పీడీఎస్‌యు జిల్లా అధ్యక్షుడు నరేందర్, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు రాజన్న, అర్వింద్, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, తహసీల్దార్

మోర్తాడ్, జూలై3: మండల కేంద్రంలో కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను బుధవారం ఎంపీపీ శివలింగు శ్రీనివాస్, తహసీల్దార్ సత్యనారాయణలు 49మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ధర్మోరాలో రెండు, దొన్కల్‌లో ఐదుగురికి, దొన్‌పాల్, పాలెంలో మూడు చొప్పున, శెట్‌పల్లిలో ఐదుగురికి, సుంకెటలో ఐదుగురు, తిమ్మాపూర్ నలుగురు,ఒడ్యాట్‌లో ఐదుగురు, మోర్తాడ్‌లో 17మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ చెక్కులను వారు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యాల రాములు, ఎంపీటీసీ సభ్యులు జక్కం అశోక్, పుప్పాల అశోక్, మహిపాల్, రంజిత్, గిర్మాజీ గోపి, ప్రవీన్, సిహెచ్.గంగారెడ్డి, రాజ్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాలో 20మంది విద్యార్థుల ఎంపిక



మాట్లాడుతున్న డైరెక్టర్

బోధన్‌రూరల్,జులై3:బోధన్ పట్టణంలోని ఉషోదయ డిగ్రీ కళాశాలలో బుధవారం టాస్క్ ఆధ్వర్యంలో జెన్‌ప్యాక్ట్ బహుళ జాతీయ సంస్థ కొరకు నిరుద్యోగ యువత కోసం నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 19కళాశాలల విద్యార్థులు 140మంది పాల్గొనగా నాలుగు దశల్లో నిర్వహించిన ఎంపిక దశలు సాయంత్రం వరకు కొనసాగాయి. చివరి దశలో 20మంది విద్యార్థులు ఫైనాల్‌గా ఎంపికయ్యారు. కళాశాల విద్యార్థులు, నిరుద్యోగ యువత కోసం టాస్క్ ద్వారా ఉద్యోగమేళా నిర్వహించడం జరిగిందని ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ సూర్యప్రకాష్, డైరెక్టర్ దుశ్యంత్ తెలిపారు. జాబ్‌మేళాలలో 20మంది విద్యార్థులు ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలను టాస్క్ జిల్లా మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, జెన్‌ప్యాక్ట్ హెచ్ఆర్ శాంసన్, కళాశాల డైరెక్టర్ దుశ్యంత్‌లు ఎంపిక పత్రాలను నిరుద్యోగ యువతకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం,విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి బంద్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ అనుబంధ సంఘ నాయకులు

ఆర్మూర్‌టౌన్,జూలై2: నేడు విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పీడీఎస్‌యు, ఏబీపీఎస్‌యు నాయకులు కోరారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షుడు ప్రిన్స్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బంద్‌ను పాటిస్తున్నట్టు తెలిపారు. నిట్ పరీక్ష పేపర్ లీక్ అయి ఫలితాల్లో స్కాం జరిగిందని, జున్ 14వ తేదీన ఫలితలు ఉండగా 4న ఫలితాలు ఇచ్చారని దేశ చరిత్రలో మొదటి 67మందికి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకులు రావడం అందులో ఒకే పరీక్ష కేంద్రం నుంచి ఎనిమిది మంది విద్యార్థులకు 720కి గాను 720మార్కులు రావడం యుజీసీ నెట్ పరీక్ష రద్దు కావడం, నిట్, పీజీ పరీక్ష వాయిదా పడడం అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఎంటీ ఏను ప్రక్షళన చేసి నిట్, నెట్, నెట్ పీజీని పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహిం చాలని అన్నారు. తక్షణమే ప్రదాని మోదీ స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ ఉపాధ్యక్షుడు శ్రావణ్, ఏఐఎస్ ఎఫ్ మండల అధ్యక్షుడు చోటు, నరేందర్, వరప్రసాద్, అనిల్, నిఖిల్, సిద్ధు, సాయి, తదితరులు పాల్గొన్నారు.

'మచ్చలేని నాయకులుగా నిలిచిపోతారు'

సదాశివనగర్, జూలై 3 : మండల పరిషత్ అధ్యక్షురాలు గైని అనసూయ, వైస్‌ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు ఐదు సంవత్సరాలు ప్రజలకు నిరంతరం సేవలందించి మచ్చలేని ప్రజాప్రతినిధులుగా మిగిలిపోతారని ఎంపీడీవో సంతోష్‌కుమార్ తెలిపారు. నేటి నుంచి ఎంపీటీసీల పదవీకాలం ముగియడంతో వారిని బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు రామచంద్రరావు, సుజాత, జయశ్రీ, సవిత, రేణుక, లక్ష్మీ, మహిపాల్ యాదవ్, స్వరూప, భైరవరెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

ఎల్లారెడ్డి, జూలై 3 : పాముకాటుతో ఓ మహిళ మృతిచెందిన సంఘటన ఎల్లారెడ్డి మండలంలోని బాలాజీనగర్ తండాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాలాజీనగర్ తండాకు చెందిన రుడావత్ కమల (44) అనే మహిళ మంగళవారం రాత్రి ఇంటి వద్ద నిద్రిస్తుండగా కాలుకు ఏదో గుర్తు తెలియని పాముకాటు వేసిందని గుర్తించి, కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఎల్లారెడ్డి ప్రభుత్వా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతురాలి భర్త వెంకట్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

కుక్క కాటుతో ఏడుగురికి గాయాలు

భిక్కనూరు, జూలై 03 : మండలంలో వీధికుక్కలు, కోతులు విజృంభిస్తున్నాయి. బుధవారం మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో ఐదుగురికి, అంతంపల్లిలో ఒకరికి, టోల్‌ప్లాజా వద్ద టోల్‌సిబ్బంది ఒకరిని వీధి కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. కాగా మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ఒక వృద్ధుడిని కోతి దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు గ్రామస్థులు తెలిపారు. వీరందరిని చికిత్స నిమిత్తం భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి కుటుంబసభ్యులు తీసుకెళ్లగా వీరికి ప్రథమ చికిత్స చేసి ఏఆర్‌వీ ఇంజెక్షన్ ఇవ్వడం జరిగిందని, కోతి కరిచిన వృద్ధుడిని కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు వైద్యాధికారిణి యేమిమా తెలిపారు. కుక్కలు, కోతులతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కుక్కల, కోతుల బెడద నుంచి తమను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఎంపీటీసీలకు వీడ్కోలు సమావేశం

దోమకొండ, జూలై 3 : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం నేటితో ముగియనుండడంతో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రమేష్, ఇరిగేషన్ డీఈ అర్చన, ఎంపీవో తిరుపతిరెడ్డి, సుపరిండెంటెండెంట్ యుగేందర్ కార్యాలయ సిబ్బందితో కలసి జ్ఞాపికను అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు మాట్లాడుతూ అధికారుల సహాయసహకారాలు మరువలేనియన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కానుగంటి శారద, నాగరాజు, జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, వైస్‌ఎంపీపీ పుట్ట బాపురెడ్డి, ఎంపీటీసీలు ఫిరంగి రాజేశ్వర్, నిమ్మ శంకర్, కడారి రమేష్, కాటేపల్లి వెంకటలక్ష్మీ, ఆసాని జ్యోతి, మల్లారెడ్డి, దోర్నల లక్ష్మీ, లక్ష్మణ్, కోట సదానంద, కో-ఆప్షన్ సభ్యులు షమ్మీ, ఏఈ బాలక్రిష్ణా, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

'పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా'

సదాశివనగర్, జూలై 03 : పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. మండల కేంద్రంనకు చెందిన ఏనుగు జనార్దన్‌రెడ్డి ప్రతిభ దంపతులు రోడ్డు ప్రమాదంలో మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీలో ఇద్దరు సభ్యత్వం ఉండడంతో వారికి పార్టీ తరపున బీమా చేయడం జరిగిందని, ఇందులో భాగంగా రూ.4లక్షల చెక్కును అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి నాయకులు పార్టీ కోసం నిరంతరం పనిచేసి పార్టీని పునర్ నిర్మాణం వైపు నడిపిస్తే వారి కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటానని అన్నారు. పద్మాజివాడి, భూంపల్లి గ్రామాలలో ఇటీవల ప్రమాదాలకు గురై మరణించిన కుటుంబాలను ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ కమలాకర్‌రావు, పార్టీ అధ్యక్షుడు మహేంద ర్ రెడ్డి, రాజేశ్వర్‌రావు, నాగాగౌడ్, బుచ్చయ్య, బద్దం శ్రీనివాస్ రెడ్డి, సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలను త్వరగా పూర్తి చేయాలి

రామారెడ్డి, జూలై 3: మండలంలోని మద్దికుంట గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేపడుతున్న అమ్మ ఆదర్శ పనులను ఇన్‌చార్జ్ ఎంపీడీవో సవితా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులను రెండోరోజులలో పూర్తిచేయాలని తెలిపారు. అదేవిధంగా రెడ్డిపేటలో నర్సరీని పరిశీలించారు. పలుచోట్ల పారిశుధ్య పనులు పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి నాయక్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన

బీర్కూర్, జూలై 3 : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్‌రహిత దినోత్సవం నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలను హెచ్‌ఎం చంద్రశేఖర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్, లోహిత, హరిప్రసాద్ పాల్గొన్నారు.

అయ్యప్ప సేవా సమితి ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కార్యవర్గసభ్యులు

కామారెడ్డిటౌన్, జూలై 3 : జిల్లా కేంద్రంలోని అయ్యప్పసేవా సమితి, అన్నప్రసాద సేవాసమితి ఎన్నికలను బుధవారం నిర్వహించారు. అయ్యప్పసేవాసమితి అధ్యక్షునిగా గందే శ్రీనివాస్, ప్రధానకార్యదర్శిగా గోనెశ్రీనివాస్, కోశాధికారిగా సోమిశెట్టి నారాయణ, అన్నప్రసాద సేవా సమితి అధ్యక్షునిగా విశ్వనాథుల రాజేందర్, కార్యదర్శిగా బాస రఘుకుమార్, కోశాధికారిగా మోటుకురి శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు. ఎన్నికైన వారికి ఎన్నిక అధికారులు కైలాస్ శ్రీనివాస్‌రావు, గౌరిశంకర్‌లు ధ్రువపత్రాలు అందించారు.

ఫోక్సో కేసులో నిందితుడి రిమాండ్

లింగంపేట, జులై 3 : మండలంలోని ఓ బాలికను పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన నిందితునిపై ఫోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు బుధవారం ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మహబూబ్‌నగర్ జిల్లా కడ్తాల్ మండలంలోని ఉప్పుగూడకు చెందిన కాలెభాస్కర్ అనే యువకుడు శంషాబాద్‌లో తన సోదరి ఇంట్లో ఉంటూ బ్లూడార్ట్ కంపెనీలో డెలీవరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. భాస్కర్ లింగంపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు నెలరోజులుగా ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైనట్లు తెలిపారు. నెలరోజుల పరిచయంతోనే బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. బాలిక అతని మాటలు నమ్మి గత నెల 26న ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకుని విచారణ జరిపినట్లు డీఎస్పీ తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంతో సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా విచారణ చేపట్టి నిందితున్ని పట్టుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితునితో పాటు బాలికను పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. బాలికను నమ్మించి మోసం చేయడం పట్ల నిందితుడిపై ఫోక్సో కేసు నమోదు చేసి నిందితున్ని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై చైతన్యకుమార్, పోలీసులున్నారు.

పత్తి సాగుకు ఊరటనిచ్చిన వర్షం



ఉమ్మడి మద్నూర్ మండలంలో సాగుచేస్తున్న పత్తి

మద్నూర్, జూలై 3 : ఉమ్మడి మద్నూర్ మండలంలో ఇటీవల కురిసిన వర్షానికి పత్తిసాగుకు కొంత ఊరట కలిగింది. రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రాంతంలో కొద్ది రోజులుగా వర్షాభావ పరిస్థితులు నెల కొనడంతో పత్తిసాగుకు ఇబ్బందికర మైన వాతావరణం నెలకొంది. జూన్ మొదటివారంలో కురిసిన వర్షాలకు రైతులు పత్తిగింజలను విత్తారు. అప్పటి నుంచి వర్షాలు సరిగ్గా లేకపోవడంతో దుక్కుల్లోని విత్తనాలు మాడిపోయాయి. ఎండల వేడిమికి కొన్ని గ్రామాల్లో పత్తి మొలకలు ఎండిపోయాయి. దీంతో విత్త నాలు మాడిపోవడంతో పాటు మొలకలు ఎండిపోయిన ప్రాంతాల్లో మళ్ళీ విత్తనాలను వేయాల్సిన పరిస్థితి రైతులకు ఏర్పడింది. పత్తి విత్తనాలు రెండు మూడుసార్లు విత్తాల్సి రావడంతో రైతులకు అదనపు భారంగా మారింది. పత్తి విత్తనాల కోసం రైతులు వేల రూపాయలను ఖర్చు చేయాల్సి వస్తుంది. వర్షాభావ పరిస్థితులతో రైతులకు విపత్కర పరిస్థితి ఏర్పడింది. ఇటీవల అప్పుడప్పుడు కురుస్తున్న వర్షంతో రైతులకు కొంత ఊరట లభించింది. పత్తి మొలకలు ఎండిపోకుండా అప్పుడప్పుడు కురిసిన వర్షం కాపాడిందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఉమ్మడి మద్నూర్ మండలంలో సుమారు 3 వేల ఎకరాల వరకు పత్తి పంట సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

విద్యుత్తు స్తంభం తొలగింపు



విద్యుత్తు స్తంభాన్ని రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన దృశ్యం.

భిక్కనూరు, జూలై 03: మండల కేంద్రంలోని పాత హరిజనవాడకు వెళ్లే దారిలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ కృషితో బుధవారం విద్యుత్ అధికారులు అక్కడి నుంచి తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుమధ్యలో ఉన్న ప్రమాదకర విద్యుత్తు స్తంభం సమస్యపై కాలనీ వాసులు ప్రభుత్వ సలహాదారుడి దృష్టికి తీసుకెళ్లగానే తానే స్వయంగా విద్యుత్తు స్తంభం మార్పుకోసం కావాల్సిన రూ.13వేలను చెల్లించారన్నారు. దీంతో విద్యుత్ స్తంభాన్ని అక్కడి నుంచి తొలగించి మరోచోటుకు తరలించడం జరిగిందన్నారు.

'పది ఎకరాలకే రైతు భరోసా ఇవ్వాలి'



బాన్సువాడలో రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్న అధికారులు

బాన్సువాడ టౌన్ :జూలై 3 : బాన్సువాడ పట్టణ సొసైటీ భవనంలో రైతు బంధు, రైతు బీమా గురించిన అభిప్రాయాల సేకరణ కార్యక్రమం బుధవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుల నుంచి అభిప్రాయాలను అధికారులు సేకరించారు. రైతుల నుంచి సేకరించిన అభిప్రాయాల్ని హైకమాండ్‌కు పంపించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. పదిఎకరాల వరకు సాగుభూమి ఉన్న రైతులకు రైతుభరోసా వర్తించేలా చూడాలని, ఇప్పుడు ఉన్న 59 సంవత్సరాల రైతు బీమా వయో పరిమితిని 61 సంవత్సరాల వరకు పెంచాలని, ప్రభుత్వం రైతులకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించాలని, ముఖ్యంగా కౌలు రైతులకు రైతుబంధు వర్తింపజేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు. రైతుల అభిప్రాయాలను తీసు కుంటున్నందుకు రైతుల తరపున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బాన్సువాడ ఆగ్రోస్ చైర్మన్ కృష్ణారెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా రైతు బంధు కన్వీనర్ అంజిరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు, బాన్సు వాడ సొసైటీ పాలకవర్గం సభ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మద్నూర్, జూలై 3 : గత ప్రభుత్వం ఇచ్చినట్లు భూస్వాములకు, రాళ్ళు, గుట్టలకు రైతు భరోసా ఇవ్వొద్దని, పది ఎకరాల వరకే రైతులకు రైతుభరోసా ఇవ్వాలని బుధవారం మద్నూర్, డొంగ్లీ మండలాల్లో రైతు సేవా సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో రైతులు తమ అభి ప్రాయాలను వెలిబుచ్చారు. ఆదాయం పన్ను చెల్లించే వారికి, ఉద్యోగులకు ఇవ్వకూడదని అభిప్రాయపడ్డారు. జిల్లా సహకార సంఘం ఆడిట్ అధికారి రామ్మోహన్ ఆధ్వర్యంలో మద్నూర్, డోంగ్లీ మండలాల్లో వివిధ గ్రామాల నుంచి వచ్చి న రైతులతో అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిలు మాట్లాడుతూ రైతు బంధును రైతు భరోసాగా మార్చిందని, రైతు బంధులో ఉన్న లోపాలను సవరించి రైతు భరోసా అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలిపారు. అదే విధంగా పలువురు రైతులు కౌలు రైతులకు కూడా గుర్తింపుకార్డులు ఇచ్చి రైతు భరోసా వర్తింపజేయాలని కోరారు. సమావేశంలో మద్నూర్ మాజీసర్పంచ్ ధరాస్ సురేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శివాజీ, డైరెక్టర్ బాలకిషన్, వ్యవసాయ అధికారి రాజు తదితరులు పాల్గొన్నారు.

'సాగు చేసిన భూములకు అందించాలి'

పెద్ద కొడప్‌గల్: రైతులు తాము సాగు చేస్తున్న భూములకు మాత్రమే రైతు భరోసా అందించాలని పెద్ద కొడప్‌గల్ మండల రైతులు రైతుభరోసా సమావేశంలో తమ అభిప్రాయాలను వెల్లడించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో సహకార సంఘం అధ్యక్షులు హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు భరోసా కార్యక్రమంపై సమావేశం నిర్వహించగా రైతులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా కొంతమంది రైతులు మాట్లాడుతూ రైతుభరోసా కింద 10 ఎకరాలు సాగుచేస్తున్న వారికి మాత్రమే నిధులు ఇవ్వాలని సూచించారు. దీంతో పాటుగానే మండలంలో పోడుభూములు అధికంగా ఉన్నందున వాటికి పట్టాలు ఇచ్చి రైతు భరోసా అందించాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగా పెద్ద పెద్ద భూస్వాములు, పెద్ద రైతులకు రైతుబంధు అందించడం వలన వారికే లబ్ధి చేకూరింది తప్పా రైతులకు లాభం లేకుండ పోయిందని తెలిపారు. దీంతో పాటుగానే రైతు భరోసా పథకం కింద డబ్బులను రైతులకు వ్యవసాయ పనులు ప్రారంభం అయ్యే ఒక నెల ముందుగానే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రత్యేక అధికారి లక్ష్మినారాయణ మాటాడుతూ సమావేశంలో రైతులు సూచించిన సలహాలు, సూచనలు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ లక్ష్మి ప్రసన్న, ఏవో నదీం, సహకార సంఘం సీఈవో సందీప్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

- కామారెడ్డిలో భిక్షాటన చేసిన ఏబీవీపీ నాయకులు



భిక్షాటన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

కామారెడ్డిరూరల్, జూలై 03 : పెండింగ్‌లో ఉన్న 8వేల కోట్లకుపైగా ఉన్న ఫీజురీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో బుధవారం భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా కన్వీనర్ రోహిత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పేద విద్యార్థులకు కాలేజీలలో స్కాలర్‌షిప్‌లు రాక ఫీజులు కట్టలేకపోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్‌లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కళాశాల ఫీజులు చెల్లించే స్థోమత లేక పైచదువుల కోసం సర్టిఫికెట్‌లు లేకపోవడంతో విద్యార్థులు తీవ్రఇబ్బందులు పడుతున్నారని రాష్ట్రప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని, ప్రభుత్వం దగ్గర డబ్బులు లేకపోతే విద్యార్థులమంతా కలిసి భిక్షాటన చేసి ప్రభుత్వంనకు పంపిస్తామని ఏబీవీపీ నాయకులు కామారెడ్డి జిల్లా కేంద్రంలో భిక్షాటన చేశారు. ఇకనైనా ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా హాస్టల్ కన్వీనర్ ఖలీల్, అల్తాఫ్, ప్రత్యూష, మానస, ప్రణీత, బలరాం, రాజు తదితరులు పాల్గొన్నారు.

చౌరస్తాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి

- బిచ్కుంద సీఐ నరేష్
- జాతీయ రహదారిపై పలు ప్రమాదకర స్థలాల పరిశీలన



ప్రమాద స్థలిని పరిశీలిస్తున్న బిచ్కుంద సిఐ నరేష్

పెద్ద కొడప్‌గల్, జూలై 03: పెద్ద కొడప్‌గల్ మండలం గుండా సాగుతున్న 161వ జాతీయ రహదారిపై గల చౌరస్తాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని బిచ్కుంద సీఐ నరేష్ రహదారి భద్రత అధికారులకు సూచించారు. బుధవారం పెద్ద కొడప్‌గల్ మండలం బేగంపూర్ చౌరస్తా, పోచారం చౌరస్తా, జుక్కల్ చౌరస్తా వద్ద ఇటీవల రహదారి ప్రమాదాలు చోటు చేసుకున్న సందర్భంలో ప్రమాద స్థలాలను పరిశీలిం చారు. ఈ సందర్భంగా సీఐ నరేష్ మాట్లాడుతూ రహదారులపై ప్రమా దాలు జరగకుండా ఇప్పటికే తమ శాఖ తరపున చర్యలు తీసుకున్నామని, అయినా కూడ కొన్నిసార్లు ప్రమాదాలు జరిగి వాహనదారులు మృత్యువాత పడుతు న్నారని తెలిపారు. ఇటీవల జుక్కల్ గేట్ వద్ద జరిగిన ప్రమాద సమయంలో రహదారి ధ్వంసం అయిందని, దీనిని బాగుచేయాలని రహదారి భద్రత అధికారులకు సూచించడం జరిగిందని తెలిపారు. దీంతో పాటుగానే చౌరస్తాల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు తప్ప కుండా వెలిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వాహనదారులు కూడా తమ భద్రతను దృష్టిలో పెట్టుకుని వాహనాలను నడపాలని సూచించారు. కార్యక్ర మంలో పెద్ద కొడప్‌గల్ ఎస్‌ఐ కోనా రెడ్డి, హైవే భద్రత అధికారి ప్రతాప్ సింగ్, పెద్ద కొడప్‌గల్ ఇంచార్జి ఎంపీడీవో సూర్యకాంత్ పాల్గొన్నారు.

ఎంపీపీ పాలకవర్గానికి ఘన సన్మానం



ఎంపీపీని సన్మానిస్తున్న ఎంపీడీవో, ఎంపీవో

నిజాంసాగర్, జూలై 3 : నిజాంసాగర్, మహ్మద్‌నగర్ ఉమ్మడి మండలాల ఎంపీపీ పాలకవర్గంకు బుధవారంతో పదవీకాలం ముగిసింది. ఎంపీడీవో సమావేశ గదిలో ఎంపీపీ జ్యోతి దుర్గారెడ్డి, వైస్ ఎంపీపీ మనోహర్‌లతో పాటు ఎంపీటీసీ, కో-ఆప్షన్ సభ్యులను అధికారికంగా పూలమాల, శాలువాలతో సన్మానించారు. ఐదేండ్ల పాటు మండల పరిషత్ పాలకవర్గంగా కొనసాగిన పాలకవర్గాన్ని సన్మానించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో గంగాధర్, ఎంపీవో యాదగిరితో పాటు మండల పరిషత్ సిబ్బంది, అధికారులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. అనంతరం ఉమ్మడి మండలాల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు సాదుల సత్యనారాయణ, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు సంగమేశ్వర్‌గౌడ్, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, తదితరులు సన్మానించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఐదేండ్ల పాటు మండలాభివృద్ధికి కృషిచేసిన వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులున్నారు.

బంద్‌ను విజయవంతం చేయండి

- విద్యార్థి సంఘాల నాయకులు పిలుపు

కామారెడ్డిటౌన్,జూలై 3: దేశవ్యాప్తంగా గురువారం కేజీ టూ పీజీ వరకు చేపట్టే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్‌ఎస్‌యూఐ, ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్‌బీ అతిథిగృహంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయా యూనియన్‌ల నాయకులు మాట్లాడుతూ లక్షల రూపాయలకు నీట్‌పరీక్ష పత్రాలు లీకేజీ చేసి లక్షల మంది జీవితాలతో ఎన్‌టీఏ ఏజెన్సీ చెలగాటం ఆడిందని, దేశవ్యాప్త ఆందోళనలు జరిగిన దేశ ప్రధాని ఇప్పటివరకు స్పందించలేదని అన్నారు. బీజేపీ హయాంలో పేపర్ లీకేజీ వ్యవహారం ఏ స్థాయిలో జరిగిందో స్పష్టం కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తుం దన్నారు. పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చైర్మన్ ప్రదీప్‌కుమార్ జోషి రాజీనామా చేయాలని అన్నారు. మానిటరింగ్ చేయడంలో విఫలం చెందిన కేంద్ర ప్రభుత్వం ప్రజలకు, విద్యార్థులకు సమాధానం చెప్పాలన్నారు. నీట్ నిర్వహణలో వివాదాలు నిత్యం జరుగుతున్న నేపథ్యంలో ఆయా రాష్ట్రప్రభుత్వాలు, విద్యార్థులు కోరుతున్నట్లు నీట్ ఎగ్జామ్‌ను రాష్ట్రాల పరిధిలోకి మార్చాలని కోచింగ్ సెంటర్లు, కన్సల్టెన్సీల పేరుతో పేపర్ లీకేజీలు చేస్తున్న నీట్‌కోచింగ్ సెంటర్ల అనుమతులు రద్దుచేసి పేపర్ లీకేజీకి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి నీట్ రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా జూలై 4న జరిగే దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు ప్రైవేట్ యాజమాన్యాలు, విద్యార్థులు స్వచ్ఛందంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌యూఐ జిల్లా అధ్య క్షుడు సందీప్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ముదాం అరుణ్, పీడీ ఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి సురేష్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకుడు శివ,మణి, భరత్ పాల్గొన్నారు.

ట్రేడ్‌లైసెన్స్ కోసం వ్యాపారస్తులకు నోటీసులు జారీ

నాగిరెడ్డిపేట, జూలై 3 : మండల కేంద్రంలోని గోపాల్‌పేట్ గ్రామ పంచాయతీ పరిధిలో గల వ్యాపారస్తులకు 2024-25 సంవత్సరంనకు సంబంధించిన ట్రేడ్‌లైసెన్స్ తీసుకోవడం కోసం సంబంధిత వ్యాపార స్తులకు బుధవారం నోటీసులు జారీచేసినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో గల సినిమా హాల్, పెట్రోల్‌బంక్‌లు, కిరాణం షాపులు, బట్టల షాపులు, ఫర్టిలైజర్ షాపులు, ఎలక్ట్రికల్ షాపులు, హోటళ్ళు తదితర వ్యాపారస్తులందరూ గ్రామ పంచాయతీ ద్వారా ట్రేడ్‌లైసెన్స్‌లు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య కోరారు. ఇట్టి ట్రేడ్ లైసెన్స్ కోసం మీ సేవా కేంద్రంలో స్పష్టమైన వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని, ఆ దరఖాస్తులను పరి శీలించి అప్రూవ్ చేయడం జరుగుతుందన్నారు. ట్రేడ్‌లైసెన్స్ తీసుకోని వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

మండల పంచాయతీ అధికారికి సన్మానం

పెద్ద కొడప్‌గల్, జూలై 03: జుక్కల్ మండల పంచాయతీ అధికారిగా బుధవారం నాగరాజ్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల పంచాయతీ అధికారి నాగరాజ్‌ను సన్మానించారు. మండల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని, మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీవోను ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో నాయకులు దేవిదాస్, లక్ష్మణ్, అస్పతి వార్ అరుణ్, విఠల్, సాయి కర్ణజాదవ్, ఉత్తమ్,సునీల్ తదితరులు పాల్గొన్నారు.